RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను
రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 281 | 2 బుధవారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## ఉత్తరాంధ్ర చరిత్రలో అపురూప ఘట్టం..

పాయకరావుపేటలో గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతి
పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు
పాయకరావుపేటలో జలాలకు హారతి ఇచ్చి విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు
2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యం
నాలుగు నదులు, తూర్పు కనుమలు దాటుతూ సాగిన కాలువ నిర్మాణం
భవిష్యత్తులో ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం చేసి 8 లక్షల ఎకరాలకు నీరు

**రాజధాని వాయిస్‌పాయకరావుపేట, సెప్టెంబర్ 1** ::ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేస్తూ గోదారమ్మ ఆ ప్రాంతంలోకి అడుగుపెడుతోంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లా వరకు పరుగులు పెడుతున్నాయి. నాలుగు నదులను, తూర్పు కనుమల కొండలను దాటుకుని వస్తున్న ఈ జలధార, ఉత్తరాంధ్ర బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు సిద్ధమైంది. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (సెప్టెంబరు 2) అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో గోదావరి జలాలకు 'జల హారతి' ఇచ్చి లాంఛనంగా విడుదల చేయనున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాదిలోనే అనకాపల్లికి నీళ్లు అందించి, కూటమి ప్రభుత్వం తన సంకల్పాన్ని నిలబెట్టుకుంది.మంగళవారం మధ్యాహ్నం 2:20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కాలువపై నిర్మించిన రెగ్యులేటర్‌ను ప్రారంభించి నీటిని విడుదల చేస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంతో ఉత్తరాంధ్ర సాగునీటి చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానుంది. ▶▶2



## 120 ఏళ్ల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 812 కుటుంబాలకు పట్టాల పంపిణీ
మూడు గ్రామాల్లో 41.46 ఎకరాల భూమికి యాజమాన్య హక్కులు
రాష్ట్రంలోనే తొలి శాశ్వత పరిష్కారమని పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్య
వేలాది మందికి ప్రయోజనం చేకూరనున్నట్లు కలెక్టర్ వెల్లడి



**రాజధాని వాయిస్ గుంటూరు, సెప్టెంబర్ 1** : ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వట్టిచెరు కూరు, పుల్లటగుంట, ఏటుకూరు గ్రామా ల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. మొత్తం 812 కుటుంబాలకు భూ పట్టాలను పంపిణీ చేయడంతో 120 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు తెరపడింది. మూడు గ్రామాల్లో కలిపి 41.46 ఎకరాల భూమికి యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. వట్టిచెరుకూరులో 515 కుటుంబాలు, పుల్లటగుంటలో 206 కుటుంబాలు, ఏటుకూరులో 91 కుటుంబాలు పట్టాలు పొందాయి. శతాబ్ద కాలంగా భూములను అనుభవిస్తున్నప్పటికీ ▶▶2

## కావేరి డెల్టా రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి



**రాజధాని వాయిస్ చెన్నై** : కావేరి డెల్టా జిల్లాల్లో సాగునీటి అవసరాల కోసం మెట్టూరు ఆనకట్ట నుంచి నీటి విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ రైతులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చిన్న కావూర్, తిమిరికొట్టై ప్రాంతాలను సందర్శించిన ముఖ్యమంత్రి స్థానిక రైతులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న ఈ ప్రాంతాల్లో పంటల పరిస్థితి, ▶▶2

## జనసేన యువజన విభాగం ఆవిష్కరణకు ఘన ఏర్పాట్లు

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవాలు
175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువజన విభాగం ప్రారంభం
యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించడమే లక్ష్యం
పిఠాపురంలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నాదెండ్ల మనోహర్



**రాజధాని వాయిస్ పిఠాపురం, సెప్టెంబర్ 1** : జనసేన పార్టీ యువజన విభాగం ఆవిష్కరణ ను పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం పిఠాపురంలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ యువజన విభాగం రాజకీయాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే కాకుండా, యువత ఆలోచనలను సమాజానికి చేరవేసే వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు. "దేశమే ఫస్ట్" అనే నినాదంతో బాధ్యతాయుతమైన యువ నాయకత్వాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో యువజన విభాగం ముందుకు సాగుతుందని తెలిపారు. ▶▶2

## గోదావరి తీరానికి అభివృద్ధి హారతి

రూ.100 కోట్లతో రహదారులు, తాగునీటి సదుపాయాలు



**రాజధాని వాయిస్ రాజమహేంద్రవరం, సెప్టెంబరు1:** 'స్వచ్ఛ గోదావరి--పవిత్ర పుష్కరాలు' థీమ్‌తో గోదావరి పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పుష్కరాల సందర్భంగా మూడు జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పంచాయతీ రాజ్, ఆర్‌డ బ్ల్యూఎస్ శాఖల ద్వారా తాజాగా రూ.100 కోట్ల నిధులు విడుదల చేశారు.పంచాయతీరాజ్ శాఖకు కేటాయించిన రూ.90 కోట్లతో 111 పనులు చేపట్టి సుమారు 141 కిలోమీటర్ల సీసీ, బీటీ రహదారులు నిర్మించనున్నారు. రాజోలు, పి.గన్నవరం, రామచంద్రపురం, రంపచోడవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో గ్రామాల నుంచి పుష్కర ఘాట్లకు వెళ్లే మార్గాలను అభివృద్ధి చేయనున్నారు. మరో రూ.10 కోట్లతో రక్షిత తాగునీటి సదుపాయాలు కల్పించనున్నారు.ప్రతి పుష్కర ఘాట్‌లో భక్తులకు తాగునీరు అందించేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గంలోని మునికూడలిని రూ.7 కోట్లతో 'మోడల్ పుష్కర పంచాయతీ'గా అభివృద్ధి చేస్తున్నారు. సప్త ఋషి ఘాట్ వద్ద సీసీ రహదారులు, టవర్ లైట్లు, మ్యాజిక్ డ్రెయిన్లు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.ఇదిలా ఉండగా, ఇప్పటికే ఏపీపీసీబీ ద్వారా రూ.100 కోట్లు కేటాయించారు. పోలవరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రతిపాదిత అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించనున్నారు. పుష్కరాలను పరిశుభ్రంగా, భక్తులకు సౌకర్యవంతంగా నిర్వహించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

## ఎస్‌సీఓ సదస్సులో పాల్గొన్న ప్రధాని

- సంభాషణ, దౌత్యమే సమస్యల పరిష్కార మార్గమన్న ప్రధాని
- ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానానికి పిలుపు
- అనుసంధానం, సాంకేతికతపై ప్రత్యేక దృష్టి
- తొలి ఎస్‌సీఓ నాగరికతల సంభాషణ వేదికకు భారత్ సిద్ధం



**బిష్కెక్, సెప్టెంబర్ 1** : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కిర్గిజ్‌స్తాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని, ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న వివిధ ఘర్షణలు, ఉద్రిక్తతల నేపథ్యంలో సంభాషణ, దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం సభ్య దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యుద్ధాలు, ఘర్షణలు ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదని, పరస్పర చర్చలు, సహకారం, దౌత్య సంబంధాల ద్వారానే వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో శాంతి నెలకొల్పేందుకు ఎస్‌సీఓ వేదిక కీలక పాత్ర పోషించగలదని అభిప్రాయపడ్డారు.ఉగ్రవాదం ప్రపంచానికి అతిపెద్ద ముప్పుగా మారిందని ప్రధాని అన్నారు. ▶▶2

## విద్యార్థులపై కేసులు కొట్టేసిన సుప్రీంకోర్టు



**దిల్లీ, సెప్టెంబరు1:** నీట్ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. నిరసనలు చేపట్టిన వారిలో తీవ్ర నేర చరిత్ర కలిగి ఉన్న 2,873 మందిపై కొత్తగా కేసుల నమోదుకు కేంద్రం, దిల్లీ పోలీసులకు అనుమతినిచ్చింది. అదేవిధంగా.. ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు సర్వోన్నత న్యాయస్థానానికి కాక్రోచ్ జనతా పార్టీ (జబీపీ) తెలిపింది.సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎదుట ఈ అంశంపై వాదనలు సాగాయి. జులై 20-25 మధ్య దేశవ్యాప్తంగా నీట్ నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. నీట్ రద్దు అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామంటూ సీజేపీ ప్రతినిధులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు మూడు నెలల సమయం కోరారు. దీనికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఆ కేసులను కొట్టేసింది.

## విజయసాయిరెడ్డిపై సజ్జల దాడి నిజమేనని ధ్రువీకరించిన కోటంరెడ్డి



**రాజధాని వాయిస్ నెల్లూరు, సెప్టెంబరు 1:** తనపై భౌతిక దాడి జరిగిందంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలు నిజమేనని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ధ్రువీకరించారు. 2022లో మంగళగిరిలో జరిగిన వైసీపీ ప్లీనరీ సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై దాడి చేశారని, ఈ విషయం అధినేత జగన్‌కు తెలిసినా ఆయన ప్రేక్షకపా త్ర వహించారని విజయసాయిరెడ్డి ఇటీవల ఓ బహిరంగ లేఖలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై సజ్జల నేరుగా ▶▶2

## పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం



- ▶▶ సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకు
- ▶▶ నదుల అనుసంధానంతో నీటి సమస్యకు పరిష్కారం
- ▶▶ గత పాలకులు బటన్ నొక్కారు.. రోడ్లకు గుంతలు పెట్టారు
- ▶▶ ఓటమి భయంతోనే గొడ్డలి పార్టీ ఏకగ్రీవాలు వద్దంటోంది
- ▶▶ నర్సాపురం పేదల సేవలో ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**రాజధాని వాయిస్ నర్సాపురం, సెప్టెంబరు1:** పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరి పాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు తెలిపారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక ▶▶2

# పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం

సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని సీఎం చెప్పారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు పెంచిన పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.73,507 కోట్లను పెన్షన్ల రూపంలో పేదలకు అందించామని చెప్పారు. రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

**మహిళా సాధికారతకు పెద్దపీట**

డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టి మహిళా సాధికారతకు బాటలు వేశామని చంద్రబాబు అన్నారు. ఏ ఆడబిడ్డా వంట కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దీపం పథకాన్ని తీసుకొచ్చామని, ఇప్పుడు దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈసారి లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల్లో ఇంకా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఉందని సీఎం పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి న్యాయం చేశామని చెప్పారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలు, ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యా అవకాశాలకు పంపిస్తున్నామని తెలిపారు.

**బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్**

బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్ ఇస్తున్నాం అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ఆర్థికంగా వెసులుబాటు కలిగించామని చెప్పారు. గ్రామంలో ఇంకా పేదలు ఉన్నారంటే ఆ గ్రామానికే అవమానమని వ్యాఖ్యానించారు. ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీ4 ద్వారా జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని చంద్రబాబు తెలిపారు. శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం



చెన్నకేశవస్వామి పాదాల వరకు నీరు పారించామని చెప్పారు. నల్లమల కొండల్లో సొరంగాలు తవ్వి నీటిని తరలించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి నీటిని ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని తెలిపారు. గోదావరి జలాలు తొలుత అనకాపల్లికి, వచ్చే ఏడాది విశాఖకు, ఆ తర్వాత వంశధార ప్రాంతానికి చేరేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నదుల అనుసంధానంతో దేశంలోని నీటి సమస్యలను పరిష్కరించాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు.

**పెట్టుబడులకు రాష్ట్రాన్ని గమ్య స్థానంగా మారుస్తాం**

గత పాలకులు పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేశారని సీఎం విమర్శించారు.

## ఒడిశా కళాకారులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భేటీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో ఒడిశాలోని గంజాం, గజపతి జిల్లాలకు చెందిన కళాకారుల బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కళాకారులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి కళా సంప్రదాయాలు, జీవన విధానాల గురించి తెలుసుకున్నారు. దేశ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్రపతి విద్య ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ పురోగతిలో కూడా విద్య కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. విద్య ద్వారానే వ్యక్తులు తమ సామర్థ్యాలను పెంపొందించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని వివరించారు.యువతకు విద్యతో పాటు ఆధునిక అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు అందేలా కళాకారులు ప్రోత్సహించాలని రాష్ట్రపతి సూచించారు. తమ కుటుంబాలు, సమాజంలోని చిన్నారులు, యువత విద్యాభ్యాసంపై దృష్టి పెట్టేలా ప్రేరేపించాలని కోరారు. భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించడంలో విద్య కీలకమని పేర్కొన్నారు. కళాకారులు తమ సంప్రదాయ కళలను కొనసాగిస్తూనే ఆధునిక అభివృద్ధిని కూడా స్వీకరించాలని ద్రౌపది ముర్ము సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని, అదే సమయంలో తమ సాంస్కృతిక మూలాలను మరువకూడదని చెప్పారు. సంప్రదాయాలు, సంస్కృతి దేశానికి గొప్ప ఆస్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో కళాకారుల పాత్ర విశిష్టమని రాష్ట్రపతి అభినందించారు. స్థానిక కళారూపాలు, సంప్రదాయాలను సంరక్షించి తదుపరి తరాలకు అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ క్రమంలో కళాకారులు సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కళాకారులు కూడా రాష్ట్రపతితో తమ అనుభవాలు, కళారంగానికి సంబంధించిన అంశాలను పంచుకన్నారు. రాష్ట్రపతితో జరిగిన సమావేశం తమకు స్ఫూర్తినిచ్చిందని వారు పేర్కొన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణపై రాష్ట్రపతి చేసిన సూచనలు తమకు మార్గదర్శకంగా ఉంటాయని కళాకారులు అభిప్రాయపడ్డారు.

## ఎస్‌సీఓ సదస్సులో పాల్గొన్న ప్రధాని

ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అన్ని దేశాలు అవలంబించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతు ఇచ్చే చర్యలను అంతర్జాతీయ సమాజం కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా అనుసంధానం, సాంకేతికత, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువత భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రధాని మోదీ ప్రాధాన్యం ఇచ్చారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక, డిజిటల్ అనుసంధానం పెరగడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. యువతలో సృజనాత్మకత, పారిశ్రామికవేత్తల ఆలోచనలను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తు సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు.స్టార్టప్ ఎకోసిస్టమ్, సాంకేతిక ఆవిష్కరణల రంగంలో భారత్ సాధించిన పురోగతిని ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సభ్య దేశాల మధ్య జ్ఞాన మార్పిడి, పరిశోధన, సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం ద్వారా ఎస్‌సీఓ దేశాల అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఎస్‌సీఓ దేశాల మధ్య సాంస్కృతిక, నాగరికతల పరమైన అనుబంధాలను మరింత బలోపేతం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ క్రమంలో తొలి ఎస్‌సీఓ సివిలైజేషన్ డైలాగ్ ఫోరం (నాగరికతల సంభాషణ వేదిక)ను భారత్‌లో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సభ్య దేశాల మధ్య పరస్పర అవగాహన, సాంస్కృతిక సహకారం, ప్రజల మధ్య సంబంధాల బలోపేతానికి ఈ వేదిక దోహదపడుతుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

## విజయసాయిరెడ్డిపై సజ్జల దాడి నిజమేనని ధ్రువీకరించిన కోటంరెడ్డి

స్పందించనప్పటికీ, అప్పట్లో వైసీపీలో ఉన్న కోటంరెడ్డి ఈ ఘటనపై స్పందించి కీలక విషయాలు బయటపెట్టారు.మంగళగిరి ప్లీనరీలో వేదికపై ఎవరితో మాట్లాడించాలనే అంశంపై విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందని కోటంరెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే స్టేజీ పక్కన ఉన్న రెస్ట్‌రూమ్‌లోకి విజయసాయిరెడ్డిని తీసుకెళ్లిన సజ్జల, ఆయన చొక్కా పట్టుకుని కొట్టారని కోటంరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అయితే, విజయసాయిరెడ్డి ఎందుకో తిరిగి దాడి చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనతో విజయసాయిరెడ్డి ఆరోపణలకు బలం చేకూరినట్లయింది. విలేకరుల సమావేశంలో మాట్లాడిన కోటంరెడ్డి, విజయసాయిరెడ్డి పేర్కొన్నట్లుగానే ఈ దాడి జరిగిందని స్పష్టం చేశారు.వైసీపీలో తనకు 72 అవమానాలు జరిగాయని విజయసాయిరెడ్డి చెబుతున్నారని, తనకు తెలిసి మరో అవమానం కూడా జరిగిందని కోటంరెడ్డి గుర్తుచేశారు. విజయసాయిరెడ్డి ఒకసారి తాళ్లపూడికి వచ్చినప్పుడు, కాకుపల్లి సెంటర్‌లో ఆయనకు వాహనాలతో ఘనస్వాగతం పలికారని, ఈ విషయం తెలుసుకున్న సజ్జల ఆయన్ను ఫోన్‌లో తీవ్ర పదజాలంతో దూషించారని కూడా కోటంరెడ్డి వివరించారు. ఈ పరిణామాలు పార్టీలో విజయసాయిరెడ్డి ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు సజ్జల వర్గం ప్రయత్నించిందన్న వాదనలకు బలం చేకూరుస్తున్నాయి. 2019లో వైసీపీ తరఫున నెల్లూరు రూరల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పార్టీ నాయకత్వంతో విభేదించి 2023లో వైసీపీని వీడారు. అనంతరం టీడీపీలో చేరి, 2024 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. వైసీపీలో అంతర్గతంగా జరిగిన విషయాలు తెలిసిన వ్యక్తిగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. విజయసాయిరెడ్డి లేఖతో మొదలైన ఈ వివాదం, కోటంరెడ్డి ధ్రువీకరణతో మరింత ముదిరి, వైసీపీ నాయకత్వాన్ని ఇరుకున పెట్టేలా మారింది.

## కావేరి డెల్టా రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

సాగునీటి అందుబాటు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. రైతులు తమ సమస్యలు, అవసరాలను వివరించగా వాటిని శ్రద్ధగా విన్న ఆయన సంబంధిత



అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.కావేరి జలాల విడుదలతో డెల్టా ప్రాంతాల్లో వ్యవసాయ కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నీటి సరఫరా సక్రమంగా జరిగేలా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి వ్యవసాయ రంగ భవిష్యత్ అవసరాలు, పంటల సాగు విధానాలు, నీటి వినియోగం వంటి అంశాలపై కూడా చర్చించారు. వ్యవసాయ ఉత్పత్తి పెంపుతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచే చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడం ద్వారా సమర్థవంతమైన పరిష్కారాలు అందించగలమనే ఉద్దేశంతోనే ఈ పర్యటన చేపట్టినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ముఖ్యమైనవని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రైతులు తమ సమస్యలను నేరుగా వివరించే అవకాశం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు గ్రామీణ ప్రాంతాల్లో సానుకూల మార్పులకు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

## 120 ఏళ్ల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం



యాజమాన్య హక్కులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు ఇది చారిత్రాత్మక పరిణామమని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ తరహాలో శాశ్వత పరిష్కారం లభించడం ఆనందదాయకమని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.60 లక్షల ఎకరాల భూమిని 22(ఏ) జాబితా నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అలాగే నాలా ఛార్జీలను 4 శాతానికి తగ్గించినట్లు వెల్లడించారు. 2026 జూలై నుంచి 2027 జూలై వరకు 67 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మంత్రి పలు కీలక ప్రకటనలు చేశారు. గుంటూరు చానల్ అభివృద్ధికి రూ.600 కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ.100 కోట్ల వ్యయంతో ఆధునిక ఆయుష్ ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఈ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. మూడు గ్రామాల్లో 41.46 ఎకరాల భూమికి శాశ్వత పరిష్కారం దొరకడంతో సుమారు 3 నుంచి 4 వేల మంది ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రజల భూ హక్కులను పరిరక్షించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. భూములపై స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## జనసేన యువజన విభాగం ఆవిష్కరణకు ఘన ఏర్పాట్లు

పవన్ కళ్యాణ్ ఆశయాలను యువతలోకి తీసుకెళ్లడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.పిఠాపురంలో యువజన విభాగం ఆవిష్కరణ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన లోగో, గీతం, ప్రచార చిత్రాలను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 25 పార్లమెంట్ నియోజకవర్గాలు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నాయని తెలిపారు. పోలీసుల అనుమతులతో బైక్ ర్యాలీలు, యువత భాగస్వామ్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. మొదటగా పవన్ కళ్యాణ్ ప్రత్యేక సందేశాన్ని కార్యక్రమంలో ప్రసారం చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఆయన కేరళలో చికిత్స పొందుతున్న ప్రాంతంలో సాంకేతిక సమస్యలు ఉన్న కారణంగా అది సాధ్యంకాకపోవచ్చని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అయినప్పటికీ పిఠాపురంలో జరిగే ప్రధాన కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.యువతకు రాజకీయాల్లో మరింత అవకాశాలు కల్పించాలన్నది జనసేన లక్ష్యమని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు, మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ యువతను భాగస్వామ్యం చేయాలని పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. యువతలో సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే దిశగా యువజన విభాగం నిరంతరం పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ తలాటం సత్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర చరిత్రలో అపురూప ఘట్టం..

**కొండలు, నదులు దాటిన ఇంజనీరింగ్ అద్భుతం**

గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించడం అనేది ఒక గొప్ప ఇంజనీరింగ్ అద్భుతం. ఈ ప్రయాణంలో పంపా, తాండవ, వరాహ, శారద వంటి నాలుగు నదులను, ఏలేరు కాలువను, తూర్పు కనుమలను దాటాల్సి వచ్చింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్లు వెచ్చించి అధునాతన సాంకేతికతతో నిర్మాణాలు చేపట్టింది. కొన్నిచోట్ల నదుల ప్రవాహానికి ఎగువన అక్విడెక్టులు, మరికొన్ని చోట్ల ప్రవాహానికి దిగువన సైఫన్లు నిర్మించారు. ముఖ్యంగా ఏలేరు నది గర్భం కింద నుంచి గోదావరి నీటిని తరలించేందుకు సైఫన్‌ను, పంపా నదిపై 30 మీటర్ల లోతు పునాదులతో భారీ అక్విడెక్టును నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 447 మీటర్ల పొడవున అక్విడెక్టు నిర్మాణం చేపట్టడం ఈ ప్రాజెక్టు సంక్లిష్టతకు నిదర్శనం.

**లక్షల ఎకరాలకు భరోసా.. భవిష్యత్తుకు మార్గం**

ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనుంది. ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. దీంతోపాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. పుష్కర ఆయకట్టు కింద 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా, తాండవ, వరాహ తదితర ఆయకట్టుల కింద మరో 58,000 ఎకరాలకు పైగా భూమి స్థిరీకరణ జరగనుంది.

వచ్చే ఏడాది నాటికి ఈ జలాలను విశాఖపట్నం వరకు పొడిగించి, ఆపై ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 213 కిలోమీటర్ల పొడవైన ఈ ఎడమ కాలువ ద్వారా మొత్తం 23.44 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెస్తారు. ఈ బృహత్తర ప్రణాళిక పూర్తయితే అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలతో సహా మొత్తం 8 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అంది, ఉత్తరాంధ్ర స్వరూపమే మారిపోనుంది.

## సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన లేడీ అఘోరీ వీడియో

**ఉజ్జయిని శ్మశానవాటికలో చిత్రీకరించిన వీడియో కలకలం**

**చితి వద్ద అభ్యంతరకర చర్యలు చేసినట్లు ఆరోపణలు**

**వీడియోపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నెటిజన్లు**

**చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు విజ్ఞప్తులు**



**ఉజ్జయిని, సెప్టెంబర్ 1 :** తెలుగు రాష్ట్రాల్లో గతంలో తీవ్ర సంచలనం సృష్టించి, వివిధ వివాదాలతో వార్తల్లో నిలిచిన లేడీ అఘోరీ మరోసారి చర్చనీయాంశంగా మారింది. జైలు జీవితం అనంతరం సాధారణ జీవితాన్ని కొనసాగిస్తుందనే భావన ఉన్నప్పటికీ, ఉత్తరాది రాష్ట్రాల్లో నివసిస్తూ సోషల్ మీడియాలో వివాదాస్పద వీడియోలను ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆమెకు సంబంధించిన ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలోని చక్రతీర్థ శ్మశానవాటికలో ఈ వీడియో చిత్రీకరించబడినట్లు ప్రచారం జరుగుతోంది. వీడియోలో లేడీ అఘోరీ చేతిలో కత్తి పట్టుకుని మండుతున్న చితి సమీపంలో కనిపించడం, అనంతరం కొన్ని అభ్యంతరకర చర్యలకు పాల్పడినట్లు దృశ్యాలు ఉండటంతో వివాదం మరింత ముదిరింది. ఈ వీడియోను ఆమె తన సామాజిక మాధ్యమ ఖాతాలో పోస్టు చేసినట్లు సమాచారం.వీడియోలో చేసిన వ్యాఖ్యలు కూడా తీవ్ర చర్చకు దారితీశాయి. తాను శ్మశానాల్లోనే ఎక్కువ సమయం గడుపుతానని, భూతప్రేతాలతో సంబంధం ఉన్న ఆచారాలు నిర్వహిస్తానని పేర్కొన్నట్లు వీడియోలో వినిపిస్తోంది. అలాగే కొన్ని హెచ్చరికల తరహా వ్యాఖ్యలు కూడా చేసినట్లు నెటిజన్లు పేర్కొంటున్నారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృత స్థాయిలో విమర్శలకు కారణమయ్యాయి. వీడియో వైరల్ కావడంతో పలువురు నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మానవ విలువలకు విరుద్ధంగా కనిపిస్తున్న ఈ తరహా చర్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. వీడియోలో కనిపిస్తున్న అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని సామాజిక మాధ్యమ వేదికల ద్వారా డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికే గతంలోనూ లేడీ అఘోరీ పలు వివాదాల్లో చిక్కుకోవడంతో ఈ తాజా ఘటన మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వీడియో నిజానిజాలపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడకపోయినప్పటికీ, ఈ అంశం ప్రస్తుతం విస్తృత చర్చకు దారితీస్తోంది. ప్రజల్లో కూడా దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీడియోకు సంబంధించి అధికారులు స్పందిస్తారా, చట్టపరమైన చర్యలు చేపడతారా అనే అంశాలపై ఆసక్తి నెలకొంది. సోషల్ మీడియా వేదికల్లో మాత్రం ఈ ఘటనపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. వీడియోలోని అంశాలపై సంబంధిత శాఖలు విచారణ చేపట్టి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని పలువురు కోరుతున్నారు.

# స్వయం సహాయక సంఘాల మహిళల ఉపాధి యూనిట్లను పరిశీలించిన కలెక్టర్

- గోనెగండ్లలో చీరల దుకాణం, పేపర్ కట్టింగ్ యూనిట్ సందర్శన
- మహిళల స్వయం ఉపాధి కార్యక్రమాలను అభినందించిన కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి
- ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు
- ఉపాధి అవకాశాల విస్తరణకు కృషి చేయాలని సూచన





**రాజధాని వాయిస్ కర్నూలు, సెప్టెంబర్ 1 :** కర్నూలు జిల్లా గోనెగండ్ల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలు నిర్వహిస్తున్న ఉపాధి యూనిట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి మంగళవారం సందర్శించారు. ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన చీరల దుకాణంతో పాటు పీఎంఈజీపీ పథకం కింద సానియా మహిళా సంఘం నిర్వహిస్తున్న పేపర్ కట్టింగ్ తయారీ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలు చేపడుతున్న వ్యాపార కార్యకలాపాల గురించి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. చీరల విక్రయ కేంద్రం ద్వారా మహిళలు ఆదాయం పొందుతూ కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్న తీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. పీఎంఈజీపీ పథకం కింద ఏర్పాటు చేసిన పేపర్ కట్టింగ్ తయారీ యూనిట్ పనితీరును కూడా కలెక్టర్ పరిశీలించారు. ఉత్పత్తుల తయారీ విధానం, మార్కెటింగ్ అవకాశాలు, మహిళలకు లభిస్తున్న ఉపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళలు సమిష్టిగా పనిచేస్తూ విజయవంతంగా యూనిట్‌ను నిర్వహించడం సంతోషకరమని అన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక సంఘా లు కీలక పాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, శిక్షణ, ప్రోత్సాహకాలను వినియోగించుకుని మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టించాలని మహిళలకు సూచిం చారు. స్వయం ఉపాధి ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని చెప్పారు. మహిళా సంఘాలు నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేస్తూ మార్కెట్ విస్తరణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. తమ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకుని ఇతర మహిళలకు కూడా ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్శనలో సంబంధిత అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. మహిళల కృషిని అభినందించిన కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# టెక్కలి అభివృద్ధే లక్ష్యం: మంత్రి అచ్చెన్నాయుడు





**రాజధాని వాయిస్ టెక్కలి, సెప్టెంబర్ 1 :** టెక్కలి నియోజకవర్గాన్ని 2029 నాటికి అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు. మంగళవారం సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారులు, రక్షణ గోడ, కాలువలు, పైపుల కల్వర్టులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి 2028 నాటికి శుద్ధమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు నాణ్యమైన తాగునీటి సరఫరా అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా అన్ని అర్హ వర్గాలకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, రక్షణ గోడలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. టెక్కలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని తెలిపారు.

# ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు ఘన సన్మానం

**రాజధాని వాయిస్ శ్రీకాకుళం, సెప్టెంబర్ 1 :** జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు ఆర్. నరసింహమూర్తిని జిల్లా పోలీసు అధికారులు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ ఆయనను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేశ్వర రెడ్డి నరసింహమూర్తికి పూలమాల వేసి, దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. పోలీసు శాఖలో ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ జ్ఞాపికను అందజేశారు. సహచర సిబ్బంది సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది. ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించిన నరసింహమూర్తి సేవలు ప్రశంసనీయమని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసు శాఖ అభివృద్ధికి ఆయన అందించిన సహకారం గుర్తుండిపోతుందని తెలిపారు. విధి నిర్వహణలో చూపిన నిబద్ధత ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించిన ఎస్పీ, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరుకున్నారు. ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా విరమణ జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా పోలీసు శాఖ తరఫున తక్షణ సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయాన్ని ఎస్పీ అందజేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా పోలీసు కుటుంబ సభ్యుల సంక్షేమానికి శాఖ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ పరిపాలన అధికారి సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె. నర్సింగరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నరసింహమూర్తికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన భవిష్యత్ జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు.

## రోడ్డు భద్రతపై అవగాహన

**రాజధాని వాయిస్ నాయుడుపేట :** విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా నాయుడుపేట పట్టణంలో పోలీసులు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం తుమ్మూరు రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, పాదచారులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం రహదారి ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ సంకేతాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పాదచారులు కూడా నిర్దేశిత మార్గాల్లోనే రహదారులు దాటాలని, వాహనాల రాకపోకలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత విషయంలో ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు .ప్రజల ప్రాణ రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి సురక్షిత ప్రయాణానికి తోడ్పడాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని వాహనదారులు, ఆటో డ్రైవర్లు, పాదచారులతో ప్రత్యక్షంగా మాట్లాడి రోడ్డు భద్రతకు సంబంధించిన సూచనలు అందించారు.

# నందిగామలో విభిన్న ప్రతిభావంతులకు నూతన స్కూటీల పంపిణీ

- లబ్ధిదారులకు స్కూటీలు అందజేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య
- స్వావలంబనకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వెల్లడి
- విద్య, ఉపాధి అవకాశాలకు దోహదపడనున్న స్కూటీలు
- సంక్షేమ పథకాలు అర్హు లందరికీ అందిస్తామని హామీ



**రాజధాని వాయిస్ నందిగామ, :** విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మంగళవారం నందిగామ పట్టణంలోని కాకాని నగర్‌లో ఉన్న తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు మంజూరైన నూతన స్కూటీలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కూటమి నాయకులతో కలిసి స్కూటీలను అందజేసిన ఆమె, లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతోందని తంగిరాల సౌమ్య తెలిపారు. ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారు ఇతరులపై ఆధారపడకుండా జీవనం సాగించేలా అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. సంక్షేమం ద్వారా వారి జీవితాల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులకు అందజేసిన నూతన స్కూటీలు వారి రోజువారీ ప్రయాణ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చేరుకోవడంలో ఇవి ఎంతో ఉపయోగపడతాయని, అలాగే విద్యాభ్యాసం కొనసాగించే వారికి కూడా సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి సాధించాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా కృషి చేస్తున్నామని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. స్కూటీలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు కృతజ్ఞతలు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

# ఇంటింట పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారుల సంక్షేమంపై ఆరా
- మంత్రి నారాయణ చేతుల మీదుగా పింఛన్ల అందజేత
- 62 లక్షల కుటుంబాలకు ఆర్థిక భరోసా
- అభివృద్ధి, ఉపాధి లక్ష్యంగా ముందడుగు





**రాజధాని వాయిస్ నెల్లూరు, సెప్టెంబర్ 1 :** రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మంగళవారం నెల్లూరు నగరంలోని 6వ డివిజన్ వుడ్‌హౌస్ అసోసియేషన్ పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేసిన మంత్రి, వారి ఆరోగ్య పరిస్థితులు, జీవన పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకుంటూ సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు అందించే పింఛన్‌ను రూ.4,000కు పెంచినట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 62 లక్షల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అలాగే దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా పెరిగిన మొత్తంలో పింఛన్లు అందజేస్తున్నామని మంత్రి వివరించారు. సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ సహాయం చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం వెనుకడుగు వేయలేదని మంత్రి నారాయణ అన్నారు. ఇప్పటివరకు పింఛన్ల పంపిణీ కోసం రూ.73,594 కోట్లకు పైగా వ్యయం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సమతుల్యం చేసుకుంటూనే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన లబ్ధిదారుడికి ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. గ్రామ, వార్డు స్థాయిలో అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ పింఛన్ల పంపిణీని పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి ఇంటి వద్దకే సేవలు అందించడం ప్రభుత్వ ప్రత్యేకత అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ రాష్ట్ర పురోగతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

# జలహారతి ఏర్పాట్లను పరిశీలించిన హోంమంత్రి అనిత

- సీఎం పర్యటనకు విస్తృత సన్నాహాలు
- ప్రధాన వేదిక, భద్రతపై అధికారులకు సూచనలు
- ఉత్తరాంధ్రకు గోదావరి జలాల చారిత్రక ఘట్టం
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం





**రాజధాని వాయిస్ అనకాపల్లి, సెప్టెంబర్ 1 :** రాష్ట్ర హోంమంత్రి వంగల పూడి అనిత మంగళవారం పోలవరం ఎడమ కాలువ వద్ద సెప్టెంబర్ 2న నిర్వహించనున్న జలహారతి కార్యక్రమం, అలాగే మార్కెట్ యార్డు వెనుక ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, కార్యక్రమం విజయవంతానికి అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధాన వేదిక నిర్మాణం, ప్రజలకు కేటాయిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అంశాన్ని సూక్ష్మంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రి అనిత మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతానికి గోదావరి జలాలను అందించే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం చారిత్రాత్మక ఘట్టంగా నిలవబోతోందని పేర్కొన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి నీరు ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చేరడం వల్ల వ్యవసాయం, తాగునీటి అవసరాలు, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊతం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమం రాష్ట్ర జలవనరుల రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ట్రాఫిక్, పార్కింగ్, అత్యవసర సేవల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రూ.98.6 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి



మాచర్ల.సెప్టెంబర్ 01రాజధాని వాయిస్ :ప్రజారోగ్యం, పారదర్శక పాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. మంగళవారం మండల పరిధిలో ఎంపీ, ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా నాగులవరం పంచాయతీ పరిధిలోని చెంచు కాలనీ నందు రూ. 55 లక్షల నిధులతో ఐటీడీఏ శ్రీశైలం వారు నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కొప్పునూరు గ్రామంలో రూ. 43.6 లక్షల నిధులతో నిర్మించిన స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని ప్రారంభించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో ముఖాముఖి నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చే బాధ్యతను స్వర్ణ గ్రామ సిబ్బంది తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గుండాల లక్ష్మీ శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు వీరాస్వామి, కొల్లూరి వెంకట్రామయ్య, వస్తపూరి శ్రీరామూర్తి, గొట్టిముక్కల బాబు, శీలం బైయమ్మ, గండిబోయిన వెంకటేశ్వర్లు, డీలర్ వెంకటేశ్వర్లు,వట్టికుండ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## అపోహలు వీడి హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవాలి



చిలకలూరిపేట. సెప్టెంబర్ 01 రాజధాని వాయిస్ :స్థానిక శ్రీ చైతన్య గార్ల్స్ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ కె. ఆంజనేయులు అధ్యక్షతన 'క్యాంపు-పియు' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఏరియా హాస్పిటల్ ఐసీటీసీ కౌన్సిలర్ కె. హనుమంత్ రావు మాట్లాడుతూ, హెచ్ఐవీ వ్యాప్తి మార్గాలు, నివారణ జాగ్రత్తలు, క్షయ-సుఖ వ్యాధుల సంబంధాన్ని వివరించారు. బాధితుల పట్ల వివక్ష వీడి అపోహలు తొలగించుకోవాలని సూచించారు. అనంతరం క్యాంపు మేనేజర్ కొండా పవన్ కళ్యాణ్ పాంప్లెట్‌తో పాటు రిస్క్ అసెస్‌మెంట్ క్యూఆర్ కోడ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి కె. పోలమ్మ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన పెద్దకొదమగుండ్ల జడ్పీ స్కూల్ విద్యార్థిని

కారంపూడి.సెప్టెంబర్ 01రాజదాని వాయిస్ :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల అమరావతి ఛాంపియన్షిప్ క్రీడా పోటీలను నిర్వహించింది. ఇందులో భాగంగా బాలికల అండర్ 17 వాలీబాల్ పోటిల్లో కారంపూడి మండలం పేద కొదమగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఎరువ లక్ష్మిదేవిశ్రీ పల్నాడు జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం రావడంలో అద్భుతమైన ప్రతిభ కనబరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూర్ణయ్య తెలిపారు.వాలీబాల్ జట్టును ద్వితీయ స్థానం రావడం లో కీలక పాత్ర పోషించిన విద్యార్థి మరియు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కాలేశ్వరావును ఉపాధ్యాయులతో పాటు, గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు



## నందిగామలో మా-ఏపీ సినీ స్టూడియోల ఏర్పాటుపై ఎమ్మెల్యేతో చర్చ



అమరావతి.సెప్టెంబర్ 01 రాజధాని వాయిస్ :ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధి లక్ష్యంగా నందిగామ సమీపంలో 'మా-ఏపీ' స్టూడియోల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యను మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న నందిగామ షూటింగ్‌లకు అత్యంత అనుకూలమని, ప్రభుత్వం స్థలమిస్తే పోలీస్ స్టేషన్, కోర్టు, ఆసుపత్రి, విల్లాల వంటి అత్యవసర సెట్లతో కూడిన స్టూడియోలను నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే సినిమాటోగ్రఫీ కందుల దుర్గేష్‌తోనూ చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ భేటీలో నటులు భవానీ కపూర్, సముద్రాల శ్రీధర్ శర్మ, ఆనంద్, సైదులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మండల సమగ్రాభివృద్ధే ధ్యేయం

లావు, జూలకంటి సుడిగాలి పర్యటన
రూ.4.20 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



వెల్దుర్తి.సెప్టెంబర్ 01 రాజధాని వాయిస్ :మాచర్ల నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన వెల్దుర్తి మండల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ చేయమని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. మంగళవారం మండల పరిధిలో ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా ఉప్పలపాడు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా రూ.55 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వెల్దుర్తి గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నందు విద్యార్థుల కోసం రూ. 3.15 కోట్లతో నిర్మించిన వసతి గృహం, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, క్రాఫ్ట్ భవనాలను ప్రారంభించారు. పాఠశాల నందు వసతులను, విద్యార్థులకు అందుతున్న విద్యపై సమీక్షించారు. ఆ తర్వాత మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ. 55 లక్షలతో నూతనంగా నేర్పించిన ఐటీడీఏ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లా పరిషత్తు హై స్కూల్ నందు నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల తాత్కాలిక భవనాలను ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న వసతి గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు ఎమ్మెల్యే జూలకంటి ఆధ్వర్యంలో ప్రజలు గజమాలతో బ్రహ్మరథం పట్టారు. డీజే మోతలు, నత్యాలు నడుమ సాదారంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కుర్రి శివారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కళ్ళం రామంజి రెడ్డి, ఎంపీపీ సంజీవరెడ్డి, జూలకంటి చిరంజీవి రెడ్డి, యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, కేశిరెడ్డి హనిమిరెడ్డి, వెంకటరెడ్డి,శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పండుగలా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

జిల్లాలో 2.26 లక్షల మందికి రూ.116 కోట్లు పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ



నరసరావుపేట. సెప్టెంబరు 01 రాజధాని వాయిస్ :సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ కృతికా శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని 28వ వార్డులో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో వారు పాల్గొన్నారు. జిల్లాలో 2.26 లక్షల మంది లబ్ధిదారులకు నెలకు రూ.116 కోట్ల మేర పింఛన్లు ఇంటివద్దే అందిస్తున్నట్లు, ఉదయం 10:30 గంటలకే 80 శాతం పంపిణీ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రంలో 62 లక్షల మందికి దాదాపు రూ.3 వేల కోట్లు ఒకటో తేదీనే పంపిణీ చేస్తున్నామన్నారు. బుధవారం ఐటీ మంత్రి నారా లోకేశ్ నరసరావుపేట పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష

- వ్యవసాయ ఉత్పాదకత పెంపుపై అధికారులతో చర్చ - కొనసాగుతున్న కార్యక్రమాల పురోగతిపై సమీక్ష
- రైతులకు మెరుగైన సేవలందించేందుకు కార్యాచరణ
- అధికారులకు పలు సూచనలు చేసిన కలెక్టర్ కృతికా శుక్లా







రాజధాని వాయిస్ పల్నాడు : జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై పల్నాడు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఐఏఎస్ మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ఉత్పాదకత పెంపు లక్ష్యంగా అమలవుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిని ఈ సందర్భంగా పరిశీలించారు. జిల్లాలో కొనసాగుతున్న వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య మరియు ఇతర అనుబంధ రంగాల కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఆయా శాఖల అధికారులు చేపడుతున్న పనుల పురోగతిని తెలుసుకుని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.వ్యవసాయ ఉత్పాదకతను మరింత పెంచేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రైతులకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న ఇతర రంగాల అభివృద్ధి కూడా రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సేవలు, సలహాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో స్థిరమైన అభివృద్ధి సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలపై చర్చించి, భవిష్యత్ కార్యక్రమాల అమలుకు అవసరమైన మార్గదర్శకాలను కలెక్టర్ కృతికా శుక్లా అందించారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

# వెలిగొండ జలాలతో మూగజీవాల దాహం తీర్చిన దృశ్యాలు వైరల్

మార్కాపురం, సెప్టెంబర్ 1 రాజధాని వాయిస్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియాలో పంచుకున్న ఒక వీడియో ప్రస్తుతం విస్తృతంగా వైరల్ అవుతోంది. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువలోకి విడుదలైన నీటిని కోతుల గుంపు తాగుతూ తమ దాహాన్ని తీర్చుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపించాయి. ఈ వీడియోను తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్న ముఖ్యమంత్రి, "జలం.. జీవం.. జీవితం" అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ జత చేశారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను సోమ వారం ముఖ్యమంత్రి చంద్రబాబు జాతికి అంకితం చేసిన విషయం తెలిసిందే. ఫీడర్ కాలువ ద్వారా కృష్ణా జలాలను నల్లమల సాగర్‌లోకి విడుదల చేసి ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రకాశం, మార్కాపురం ప్రాంత ప్రజల్లో ఆనందాన్ని నింపగా, ప్రాజెక్టు ప్రారంభం చారిత్రక ఘట్టంగా నిలిచింది.ప్రాజెక్టు ప్రారంభమైన మరుసటి రోజే ఫీడర్ కాలువలో ప్రవహిస్తున్న నీటిని కోతులు గుంపులుగా వచ్చి తాగుతున్న దృశ్యాలు కనిపించాయి. చిన్న కోతులతో పాటు పెద్ద కోతులు కూడా కాలువ వద్దకు చేరుకుని నీరు తాగుతూ కనిపించాయి. ఈ దృశ్యాలను స్థానికులు చిత్రీకరించగా, అనంతరం అవి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం పొందాయి. ఈ వీడియోను ముఖ్యమంత్రి చంద్రబాబు పంచుకోవడంతో మరింత మంది దృష్టిని ఆకర్షించింది. కరవు పరిస్థితులు ఎదుర్కొనే ప్రాంతాల్లో నీటి వనరులు అందుబాటులోకి రావడం వల్ల కేవలం ప్రజలకే కాకుండా అడవి జంతువులు, పక్షులు, ఇతర జీవరాశులకు కూడా ఉపయోగం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ దృశ్యాలు వెలిగొండ ప్రాజెక్టు ప్రభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొంటున్నారు.సాగు, తాగునీటి అవసరాలను తీర్చడం లక్ష్యంగా నిర్మించిన వెలిగొండ ప్రాజెక్టు వల్ల లక్షలాది మందికి ప్రయోజనం చేకూరనుంది. అదే సమయంలో నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న అటవీ ప్రాంతాల్లోని జీవరాశులకు కూడా ఇది ఉపయుక్తంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫీడర్ కాలువలోకి చేరిన నీటిని కోతులు స్వేచ్ఛగా తాగుతున్న దృశ్యాలు అందుకు నిదర్శనంగా నిలిచాయి. మానవులతో పాటు ప్రకృతిలోని ఇతర జీవరాశుల అవసరాలను కూడా నీటి వనరులు తీర్చగలవని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ అభివృద్ధితో పాటు పర్యావరణ సమతుల్యతకు కూడా తోడ్పాటు అందుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్కీ డ్రా కరపత్రాల ఆవిష్కరణ



కారంపూడి.సెప్టెంబర్ 01 రాజధాని వాయిస్ :స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో మంగళవారం శ్రీ వాసవి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్కీ డ్రా కరపత్రాలను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,ఈ నెల 18న శుక్రవారం సాయంత్రం 7 గంటలకు స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో అందరి సమక్షంలో లక్కీ డ్రా తీయనున్నట్లు తెలిపారు. విజేతలకు బంపర్ బహుమతిగా హెచ్ఎఫ్ డీలక్స్ బైక్, మొదటి బహుమతిగా డబుల్ డోర్ ఫ్రిడ్జ్, రెండో బహుమతిగా మొబైల్ ఫోన్, మూడో బహుమతిగా వాషింగ్ మెషిన్, నాలుగో బహుమతిగా 32 అంగుళాల టీవీతో పాటు మరో 20 కన్సొలేషన్ బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు, కమిటీ సభ్యులు మరియు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మహానేత వైఎస్సార్ వర్ధంతిని జయప్రదం చేయండి బత్తుల హరికృష్ణ



పిడుగురాళ్ల.సెప్టెంబర్ 01రాజధాని వాయిస్ :దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని గురజాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రెసిడెంట్ బత్తుల హరికృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కరాలపాడు మెయిన్ సెంటర్‌లో గల వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం ఉదయం జరిగే వర్ధంతి వేడుకల్లో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. పేదలు, రైతులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రైతు బజార్లలో తగ్గింపు ధరలతో బియ్యం విక్రయాలు



గుంటూరు.సెప్టెంబర్ 01 రాజధాని వాయిస్ :జిల్లా రైతు బజార్లలో తగ్గింపు ధరలతో బియ్యం విక్రయాలు జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ధరల పర్యవేక్షక కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ,రైతు బజార్లలో తగ్గింపు ధరలతో రెండు రకాల బి.పి.టి బియ్యం - స్టీమ్ మరియు పచ్చి బియ్యం విక్రయించడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు కానీ లేదా రేషన్ కార్డు కానీ చూపించి 10 కేజీలు వరకు పొందవచ్చని తెలిపారు.ఆయిల్ ఫెడ్ ద్వారా వంట నూనెలు తగ్గింపు ధరలలో రైతు బజార్లలోఅందుబాటులో తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. ఉల్లిపాయల విక్రయాలు విక్రయాలు పట్ల పౌరసరఫరాల కమిషనర్ ను కోరడం జరుగుతుందన్నారు. ఆహార సలహా సంఘం సభ్యులు హరిబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశముల మేరకు జిల్లాలో స్టీమ్ మరియు పచ్చి బియ్యం కౌంటర్లు పెట్టి తగ్గింపు ధరలలో ప్రజలకు అందుబాటులో ఉంచినందుకు జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. బహిరంగ విఫణిలో పంచదార,ఉల్లిపాయలు, నూనెలు,బెల్లం ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. సామాన్య ప్రజానీకా నికి ఊరట కల్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి.సత్యనారాయణ చౌదరి, తూనికల కొలతలు, కమర్షియల్ టాక్స్, ఫుడ్ సేఫ్టీ, రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కూటమి ప్రభుత్వం కజ్జం సైదయ్య



మాచర్ల.సెప్టెంబర్ 01 రాజధాని వాయిస్ :కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం నిరుపేద కుటుంబాలకు పెద్దకొడుకులా అండగా నిలుస్తోందని టీడీపీ సీనియర్ నేత కజ్జం సైదయ్య అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోలూరి నరసింహారావుతో కలిసి ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com